# 3

# “నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి” (1 పేతురు 1:13-25)

స్పష్టమైన భావన ఒక బైబిల్ విద్యార్థికి మంచి వనరు. దీనితో ప్రపంచములోనికి వెళ్ళి దానిని అర్థం చేసుకొనగలుగుతాడు. లేకపోతే అది అతనికి నష్టం. పేతురు పత్రికకు మొదటి పాఠకులైన క్రైస్తవులలో ఒకనివిగా, ఆ మొదటి శతాబ్దములోని ఆసియాలోని గొప్ప పట్టణాలలో ఒకటైన స్ముర్న, ఎఫెసు, పెర్గము, ఏదైన ఒక పట్టణములో ఉన్నట్టు నిన్ను నీవు ఊహించుకో. కేవలం మొదటి శతాబ్దములోని ఆసియాలో మాత్రమే 1 పేతురులోని పదప్రయోగాల శక్తిని మనము అర్థం చేసుకోగలము.

నీవు ప్రవేశించిన ప్రపంచములో సంఘము నూతనమైనది. సంభవించిన క్రీస్తు సిలువ మరణం యింకా జ్ఞాపకాలలోనే ఉంది. మీ పట్టణాన్ని దర్శించిన మొదటి సువార్తికుని జ్ఞాపకము చేసుకో. మొదట ఆయన ఎవరో తెలుసుకోవాలనే ఆరాటం, అయితే నీకు ఆశ్చర్యాన్ని కలిగించేలా అతని సహనం మరియు సందేశము నచ్చజెప్పాయి. దేవుడొక్కడే మరియు మనుష్యులందరు ఆయనకు వ్యతిరేకంగా తప్పుచేసి శత్రువులుగా మారారని ఆయన చెప్పాడు. అంతేకాక దేవుడు ఆయన కుమారుని రక్షకుడిగా పంపాడని, ఆయన ప్రభువైన క్రీస్తు అని చెప్పాడు. ప్రేమ మరియు నిరీక్షణ కలిగిన ఆ సందేశం వినిన తరువాత నీవు క్రైస్తవుడుగా మారావు.

పది లేక పదిహేను సంవత్సరములు గడిచిపోయినవి. మీరు మరియు యితరులు మీ సమాజపు మత సంబంధమైన ఆచారాలను పరిత్యజించారు, మీ స్నేహితులలో కొందరు మీ పట్ల కఠినముగా మారారు. స్నేహితులు, యిరుగుపొరుగువారు మిమ్మలను వెర్రివారన్నారు; అధికారులు మీరు సేవిస్తున్న దేవుని గురించి ప్రశ్నించారు. మీలో కొందరు క్రీస్తును త్యజించి, విశ్వాసుల జీవితాలను దుఃఖకరముగా మార్చుటను చూచి మీకు ఎంతో బాధ కలిగింది.

ఈ ప్రపంచములో క్రైస్తవులు, ప్రోత్సాహానికై ఆతురతపడుతున్నారు; 1 పేతురు వంటి పత్రిక ఆత్మీయ జీవితానికి మరియు మరణానికి మధ్య తేడాని వివరించగలదు. పేతురు సందేశం చాలా సరళమైనది. మీరు, మీ సహ క్రైస్తవులు మీకున్న ఉత్సాహమును కోల్పోరాదు. “మీ మనస్సు అను నడుముకట్టుకొని నిబ్బరమైన బుద్ధిగలవారై ... ఉండుడని” (1:13) పత్రిక చెప్పుతుంది. దేవుడు తన ప్రజలు పరిశుద్ధులుగా ఉండాలని కోరుకుంటున్నాడు. ఈ విషయానికి బలం చేకూర్చుటకు, ప్రబలీకరణ చేయుటకు లేవీయకాండము 1:16ను ఎత్తి చూపుచు ఈ విషయాన్ని జ్ఞాపకం చేసాడు: “నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి” (లేవీయకాండము 11:44; 19:2; 20:7).

పరిశుద్ధత! సూటిగా చెప్పాలంటే, ఈ పదమును క్రైస్తవులు అన్వయించుకొనుటకు కష్టమైనది. ఎలా వారు పరిశుద్ధులుగా ఉండగలరు? తన పత్రిక చదువువారికి దీవెనకరమైన మూడు ముఖ్య విషయాలను అనగా: విధేయత, విమోచన, మరల జన్మించుట అను మూడు అనుభవాలను జ్ఞాపకము చేస్తూ పేతురు ఈ ప్రశ్నకు సమాధానాన్ని తెలియజేసాడు.

## పరిశుద్ధమైన పిల్లలవలె విధేయులగుట (1:13-17)

మనలో అనేకులకు శ్రమలు మరియు క్రైస్తవ్యం యొక్క వాస్తవికతకంటె సిద్ధాంతపరంగా దగ్గర సంబంధం కలిగియున్నాం. పేతురు యొక్క ప్రారంభ పాఠకులకు యిది భిన్నమైనది. ఎప్పుడైతే ఒక సహోదరుని పట్టణపు నడిబొడ్డునకు ఈడ్చి, బట్టలు ఊడదీసి, ఒక కొయ్యకు కట్టి కొడతారో అప్పుడది నిజమైన శ్రమ. ఎప్పుడైతే ఒక సహోదరి కుటుంబము ద్వారా వెలివేయబడి, వారిచే పలకరింపబడక, ఆమె పిల్లలు స్నేహితులు లేనివారిగా ఉండి ఆమె జీవితమే శ్రమగా మారితే అది నిజమైన శ్రమ. పేతురు పత్రిక చదువువారు ఎన్నడును వెనుకకు తిరిగి వారికంటె ముందున్న క్రైస్తవులు సహించిన శ్రమను చూసి జాలిగా తలను ఊపిన వారుకారు. కానీ కేవలం వారి వీపుపై గాయాలను చూపగలిగేవారు.

వారి గాయాలకు మరియు బాధకు పేతురు ఎలా స్పదించాడు? దేవునికి విధేయులై ఉండమని ఆయన క్రైస్తవులకు చెప్పాడు (1:14). తమ జీవితాలలోనుండి పాపమును తొలిగించుకొని, నూతన ఆసక్తితో పరిశుద్ధులుగా ఉండుడని పేతురు వారిని ప్రేరేపించెను. అగ్ని సువర్ణమును శుద్ధిపరచునట్టుగా శ్రమలు వారిని పరిశుద్ధపరచి మరియు శుద్ధిపరచునని పేతురు చెప్పినట్టుగా కనిపిస్తుంది (1:7). 1 పేతురులో హృదయం బలహీనపరచబడే స్థితి మనకు ఎక్కడా తారసపడలేదు. పేతురు, “ఒక వేళ శత్రువు యుద్ధము కోరుకుంటే, ఒక యుద్ధమును, చేద్దాం. చెడును పరిశుద్ధతో పోరాడదాం” అని చెప్పినట్టుగా కనిపిస్తుంది.

పేతురు విధేయతను, మరియు పరిశుద్ధతను రెంటిని కలిపి ఒకదానితో ఒకటి కలిసుండేటట్లుగా మాట్లాడుట ఆకస్మికంగా, నిర్భయంగా జరిగింది (1:14, 15). పరిశుద్ధత అనేది మనస్సు యొక్క స్థితి కాదు. ఇది జీవించే మార్గం. పరిశుద్ధతకు కనీసం రెండు విషయాలు అవసరం. మొదటిగా పరిశుద్ధత వినయమును కోరుకుంటుంది. మనలను మనమే నడిపించుకొనుటకై మార్గముగాని, లేదా జ్ఞానముగాని లేదు అనే విషయాన్ని ఖచ్చితముగా మనము గమనించాలి. రెండవది, పరిశుద్ధతకు కావలసింది నమ్మకము. మనం ఎటువంటి భయం లేకుండా మనలను మనమే వేరొకరి నడిపింపునకు అప్పగించుకొనవలసినవారమై యుండాలి. పేతురు చిన్న పిల్లల స్వభావాన్ని కోరుకోవటంలో ఆశ్చర్యం లేదు అందుకే పేతురు యిలా అన్నాడు, “మీరు విధేయులగు పిల్లలై, ...” (1:14).

దురదృష్టవశాత్తు కొంతమంది క్రైస్తవులు, మనలను మనము ఎటువంటి ప్రశ్నలేకుండా మన పరిశుద్ధత యొక్క బాధ్యతను స్వీకరించినవారికి అప్పగించుకొనవలెను అని అనుకొని శిష్యత్వాన్ని అపార్థం చేసుకొనిరి. పేతురు ఆజ్ఞాపించిన పిల్లలను పోలిన విధేయత దేవునితో క్రైస్తవుల సంబంధములో వినయము మరియు నమ్మకం అవసరం అని పేతురు కోరాడు. మన జీవితాలను నడిపించు దేవుని హక్కును, అధికారమును యితరులు తమ చేతులోనికి తీసుకోవడానికి అనుమతించడం విగ్రహారాధనవంటిది. యిట్టిది పరిశుద్ధతకై మనము చేస్తున్న పోరాటాన్ని ఆపివేయుటయగును. నమ్మకము, వినయము మరియు విధేయతలు క్రియారాహిత్యాన్ని వ్యతిరేకిస్తున్నాయి. క్రీస్తు శిష్యులు దేవుని చిత్తము కొరకు అన్వేషించి మరియు దానివలె జీవిస్తారు.

ప్రస్తుతం జీవిస్తున్న క్రైస్తవుల మంచితనమును వారు ఎరిగిన పాత జీవితాల లక్షణాలకు పోల్చితే వ్యత్యాసంగా ఉంది. వారి ప్రస్తుత జీవితము యొక్క శ్రేష్ఠత్వం స్పష్టముగా వ్యక్తమవుతుంది. అందువలననే లోకమెందుకు క్రైస్తవులను అపహాస్యము చేయుచున్నదో, బాధపెట్టుచున్నదో

పేతురు పత్రికను చదువుచున్న వారికి అర్థం కాలేదు. ఎందుకు దేవుడు యిట్టి శ్రమలను అనుమతిస్తాడు? ఎందుకు వారు శ్రమపెట్టబడుతున్నారు? ఈ ప్రశ్నలు పురాతనమైనవి. యోబు తనలో కలిగిన ఆకస్మిక నిరాశను వ్యక్తపరుస్తూ, "సర్వశక్తుడగువాడు నియామక కాలములను ఎందుకు ఏర్పాటు చేయడు? ఆయన నెరిగియున్నవారు ఆయన దినములను ఎందుచేత చూడకున్నారు? ..." (యోబు 24:1; NIV). కీర్తనాకారుడు గర్విష్టుల యొక్క అభివృద్ధిని చూసి యిలా ఒప్పుకొనుచున్నాడు, "నా పాదములు జారుటకు కొంచెమే తప్పెను; నా అడుగులు జార సిద్ధమాయెను. భక్తిహీనుల క్షేమము నా కంటబడినప్పుడు గర్వించువారినిబట్టి నేను మత్సరపడితిని" (కీర్తనలు 73:2, 3; NIV).

పేతురు శ్రమలను అర్థం చేసుకొన్న విధానం యోబు స్నేహితులు అర్థం చేసుకొన్నట్టుంది. ఎలీఫజు (యోబు 5:17) మరియు ఎలీహు (యోబు 33:19) అనువారు శ్రమలు దేవుని సేవకులను పవిత్రపరచి, వారికి సహింపును యిస్తాయని వాదించారు. సువర్ణము అగ్నివలన శుద్ధిపరచబడినట్టు శ్రమలు క్రైస్తవుల విశ్వాసాన్ని శుద్ధిచేస్తాయని పేతురు చెప్పిన సూచనలు, పైన చెప్పిన సమాధానములాంటివే. అన్ని శ్రమలు దేవుని యొద్దనుండి శిక్షింపబడుటకు కాదు, అయినప్పటికి అవి క్రైస్తవులకు ఉపయోగపడును. చివరిగా శ్రమలను గూర్చి పేతురు జవాబు, అట్టిది దేవుని నిష్పక్షపాతమైన తీర్పునకు జ్ఞాపకాలని తెలియజేసాడు (1:17). ఈ దృష్టాంతములో, పేతురు జవాబు 73వ కీర్తనతో సమాంతరంగా ఉంది. చివరిగా కీర్తనాకారుడు, దుష్టుల అభివృద్ధి తాత్కాలికమని ముగించాడు. తత్ఫలితంగా, పేతురు దానినే చేసాడు.

దైవభక్తిగలవారు వారి ప్రతిఫలమును పొందుదురు, అలాగే దుష్టులు సమస్త తప్పులను సరిచేయు ఆ చివరి దినమందు దేవుని ఉగ్రతను రుచి చూచెదరు. ప్రస్తుత కాలానికి, పరిశుద్ధులుగా ఉండుటకు శ్రమలను నిశ్చయించుట అనవసరం. "ఈ భూమిపై ప్రవాసితులు" అనే విషయాన్ని పేతురు తన పత్రిక చదువుచున్న వారికి చెప్పుచున్నాడు. వినయము, నమ్మకం మరియు విధేయత ఈ మూడు "భయము" మరియు "భూమి పై ఉన్నంతవరకు" అనే మాటలలో యిమిడి ఉన్నాయి. దీనికి ప్రతిఫలముగా పేతురు యిలా చెప్పాడు, "జీవితం యొక్క అన్ని కష్టతరమైన వివాదాంశాలకు మీ వద్ద సమాధానం లేకపోవచ్చు. కాని మీరు ఈ సమాధానం కలిగియున్నారు: సృష్టికర్తయైన దేవుడు మిమ్ములను ఎరిగియున్నాడు, ప్రేమించుచున్నాడు, మరియు మిమ్ములను విమోచించియున్నాడు."

### క్రీస్తు రక్తముచే విమోచింపబడియుండుట (1:18-21)

పేతురు తన పత్రిక చదువుచున్నవారికి, వారి పూర్వపు జీవిత విధానాన్ని 1:14 మరియు 1:18లో జ్ఞాపకం చేసాడు. 14వ వచనములో పూర్వపు అజ్ఞాన దశలో వారికుండిన కోరికలను, 18వ వచనములో వారు పితురులనుండి వారసత్వంగా పొందిన వారి వ్యర్థ ప్రవర్తనను గూర్చి మాట్లాడుతూ, దేవుడు లేకుండా ప్రజల జీవితాలు అజ్ఞానమునకు మరియు లక్ష్యములేని స్థితికి నడిపింపబడతాయి. లోతైన జ్ఞానములేకుండా ఎన్నటికి తీరని మన దైనందిక కోరికలను తీర్చుకోవాలని అనుకుంటాం.

తెలివిగా, ఆధునికంగా, సాహసము అనేవి ఈ సమకాలీన ప్రపంచముచే చేయబడిన ఊహలన్నీయు, అనేక వేల సంవత్సరాలు తమ సంతోషాన్నే గాలించి, తమ జీవితాలను నలిపిన ఆ అజ్ఞానమును మాత్రమే విస్తరింపజేస్తాయి తప్ప మరి దేనిని కాదు. అజ్ఞానముగా శారీరిక

కోరికలను తీర్చుకోవాలనే ఆశను వెంబడించుట బానిసలుగా చేస్తుంది. ఎవరికైతే స్వాతంత్ర్యము వాగ్దానము చేయబడిందో, వారు యింకను చెడ్డవారిగా ఉండగానే పేతురు వారిని గూర్చి యిలా వ్రాసాడు: "... ఒకడు దేనివలన జయింపబడునో దానికి దాసుడగును గదా" (2 పేతురు 2:19; NIV).

ఈ క్రైస్తవులు ఎరిగియున్న బానిసత్వానికినీ, బలహీనపడుతున్న పూర్వ జీవితాలకును మరియు క్రీస్తునందున్నవారు అనుభవిస్తున్న స్వాతంత్ర్యమునకును మధ్యగల వ్యత్యాసాన్ని పేతురు చిత్రీకరించాడు. వారు విమోచింపబడియున్నారని పేతురు చెప్పాడు. "విమోచన" అనే పదమును "బంధ విమోచన ధనమును" చెల్లించినందుకు గ్రీకు ప్రపంచములోని మతరహిత రచయితలచే వాడబడింది. ధనవంతుడుగాని లేక గొప్ప అధికారముగలవాడుగాని దొంగ సంస్థలకు గాని లేక దోపిడి దొంగలకు చెల్లించుటకు గాని ఎక్కువ మొత్తాన్ని తేవలసియుంటుంది. క్రీ.శ. 74లో జూలియస్ సీసర్ జీవితములో దీనికి సంబంధించిన ఒక సంఘటనను రోమా చరిత్రకారుడైన సుటోనియస్ వివరించాడు. యువకుడైన కైసరు ఎజియన్ సముద్రములో ఉన్న రోదు ద్వీపమునకు, అలంకార శాస్త్రమును చదవడానికి ప్రయాణములో ఉన్నాడు. అప్పుడు ఆయన ప్రయాణిస్తున్న ఓడ సముద్రపు దొంగల చేతిలో పడింది. కైసరును విడిపించుటకు 50 తలాంతులను విమోచన ధనముగా మిలేతు పట్టణానికి పంపించాడు. ఎక్కువ మొత్తాన్ని మిలేతు చెల్లించగా, సముద్రపు దొంగలు కైసరును విడిచిపెట్టారు.

ధనవంతులకు, గొప్పవారికి వారిని విడిపించడానికి చెల్లించే ధనము బంగారము మరియు వెండి రూపములో ఉంటాయి. శరీరేచ్ఛలకు బానిసలుగా మారిన వారిని విడిపించుటకు చెల్లించిన విమోచన ధనం వీటికంటే అమూల్యమైనది – దేవుని కుమారుని రక్తము (1:18, 19). దానిని పౌలు యిలా పదబంధం చేసాడు: "... ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు, పాపము ఎరుగని ఆయనను మనకోసరము పాపముగా చేసెను" (2 కొరింథీయులకు 5:21).

పేతురు క్రీస్తును నిష్కళంకమైన గొఱ్ఱె పిల్లగా వర్ణించాడు (1:19). ప్రకటన గ్రంథము 5:8లో "గొఱ్ఱె పిల్ల" అనే మాట క్రీస్తుకొరకు ఉపయోగించబడింది. కాని గ్రీకు పదము "చిన్న గొఱ్ఱె పిల్ల" అనే అర్థం వచ్చేలా కొద్దిగా మార్చబడింది. క్రీస్తును గూర్చి వ్రాయవలసివచ్చినప్పుడు క్రొత్త నిబంధన వ్రాసినవారు చాలా ప్రియమైన పదాలను ఉపయోగించారు. చాలాసార్లు అపొస్తలుల కార్యములయందు (3:13, 26; 4:27, 30) ఆయన "సేవకుడుగా" పిలువబడ్డాడు (KJVలో "కుమారుడని" అపొస్తలుల కార్యములు 3:13, 26నందు మరియు "శిశువు" అని 4:27, 30లో తర్జుమా చేయబడింది). మొదటి శతాబ్దపు చివరిలో రెండవ శతాబ్దపు ప్రారంభమునందున్న క్రైస్తవులు క్రీస్తును గూర్చి వ్రాసేటప్పుడు "శిశువు" అని పిలిచేవారు. "గొఱ్ఱె పిల్ల" మరియు "శిశువు" అనే పదాలు క్రీస్తును, అమూల్యమైనవానిగాను మరియు నిష్కళంకమైనవానిగాను ఆలోచించుటకు బలవంతము చేయుచున్నాయి.

పౌలు క్రీస్తును పస్కాగా వివరించాడు (1 కొరింథీయులకు 5:7). క్రీస్తుకు మరియు పస్కా బలికి మధ్య అదే విధమైన సంబంధమును యోహాను 19:36నందు చూడగలము. యిక్కడ యోహాను ఆయన ఎముకలలో ఒకటైనను విరువబడకుండుటను గూర్చి వ్రాసెను. 1:18–21లో "నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱె పిల్లను" పేతురు ఉదహరించాడు. వాస్తవంగా దీనిలో పస్కాను సూచించు ప్రత్యేకమైన వచనము లేనప్పటికి మనలను నిర్గమకాండము 12లోని గొఱ్ఱె పిల్ల వధ మరియు దేవుడు ఆ గొఱ్ఱె పిల్ల రక్తము ప్రోక్షింపబడిన ద్వారబంధపు కమ్ముల

గల గృహమును దాటిపోవుటకు సంబంధించిన వచనాల జ్ఞాపకాలలోనికి మనలను తీసుకొని పోతుంది. గొఱ్ఱె పిల్ల యొక్క రక్తము పాపిని విమోచించి, సంపూర్ణునిగా చేసి, వినాశకుడి శక్తినుండి అనగా సాతానునుండి స్వతంత్రునిగా చేయును.

ఈ గొప్ప దేవుని విమోచనా కార్యము క్రీస్తునందు జగత్తు పునాది వేయక మునుపే నియమించబడెను. అయితే, అది అంత్య కాలమందు సంపూర్ణ సిద్ధియగుచున్నది (1:20). ఆత్మ ఎదురు చూస్తున్న దేవుని వాగ్దానముల నెరవేర్పును గూర్చి పాత నిబంధన అంతటియందు వెల్లడి యాయెను. దావీదు బీజము, కొమ్మ, సింహాసనముపై ఆసీనమవును, మరియు దేవుడు తన ప్రజలను పరిపాలించును. జనుల హృదయములపై ఒక క్రొత్త నిబంధన లిఖించబడును (యిర్మీయా 31:33). చిఱుతపులి, మేకపిల్లలతో కలిసి పరుండును (యెషయా 11:6). దేవుని వాగ్దానములన్నియు వారి ద్వారా ఈ కడవరి కాలమందు ప్రత్యక్షపరచబడినవని, పేతురు తన పత్రిక చదువువారికి తెలియపరచాడు. వారు అన్నింటికి వారసులని హామి యిచ్చాడు. క్రీస్తు పునరుత్థానము ద్వారా క్రైస్తవులకు అనుగ్రహింపబడిన విశ్వాసము మరియు నిరీక్షణ సహజముగానే క్రైస్తవులకు పరిశుద్ధతను కలిగిస్తుంది.

## అక్షయమైన బీజమునుండి పుట్టియుండుట (1:22-25)

“బాప్తిస్మము” అను పదము 1 పేతురునందు ఒక్కసారి మాత్రమే కనిపించినప్పటికిని (3:21), బైబిల్‌ను జాగ్రత్తగా గ్రహించు విద్యార్థులు బాప్తిస్మము 1 పేతురు ప్రతికలో ప్రాభల్యము కలిగిన చర్చనీయాంశమని గుర్తించగలరు. నూతనముగా పశ్చాత్తాపపడినవానికి బాప్తిస్మము యిచ్చునప్పుడు ఆది సంఘ పెద్దలు ఆచారముగా పునః ఉచ్చరించే పదాలుగల పత్రికయని చెప్పుటకు కొందరు చాలా దూరంగా వెళ్ళరు. ఎప్పుడైతే ఒక వ్యక్తి బాప్తిస్మము పొందుతాడో, వాడు నూతనంగా జన్మించినవాడు. క్రైస్తవుడు “నూతన జీవములో” (రోమీయులకు 6:4) నడుచుటకు బాప్తిస్మమునుండి బయటకు వచ్చాడని పౌలు చెప్పినప్పుడు తన ఉపమానపూరితమైన మాటను ఒక అడుగు ముందుకు తీసుకొనివెళ్లాడు. “మీరు క్షయ బీజమునుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యము మూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు” (1:23) అని పేతురు చెప్పినప్పుడు అతడు క్రైస్తవుల బాప్తిస్మము గూర్చి ప్రస్తావించాడనడంలో సందేహము లేదు (1 పేతురు 1:3లో చెప్పినట్లు).

“... మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనిన వారైయుండి ...” (1:22) అని పేతురు సూచించినప్పుడు క్రైస్తవులు రక్షణను పొంద యోగ్యతను సంపాదించుకొన్నారని చెప్ప ఉద్దేశించలేదని వివరించాడు. యేసు క్రీస్తు పునరుత్థానము తరువాత తొలి పెంతెకొస్తు దినమందు పేతురు “మూర్ఖులైన ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడని” (అపొస్తలుల కార్యములు 2:40) వారిని బలవంతపెట్టాడు! దేవుని కృపవలన పాపక్షమాపణ మరియు నిత్య జీవము యివ్వబడ్డాయి. వినువాడు ఖచ్చితముగా వెళ్ళి యివ్వబడిన బహుమానమును స్వీకరించాలని సూచించే కృపా సిద్ధాంతముతో యిది రాజీపడదు, “మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై యుండి ...” అని పేతురు చెప్పినప్పుడు ఈ అర్థమునే చెప్పాడు. వారు కృప మరియు నిరీక్షణను గూర్చిన సందేశమును విని మరియు ప్రభువు ఆజ్ఞాపించినవాటిని చేసారు.

పరిశుద్ధత అనునది నూతనముగా జన్మించుట అను దానినుండి వేరుగా ఉండునది కాదు.

బీజము అక్షయమైనదైయున్నది, నమ్మువాడు పరిశుద్ధ పరచబడియున్నాడు. చిన్న ఆసియానందు ఉన్నవారు పేతురు ఆజ్ఞాపించిన పరిశుద్ధ జీవితం జీవించుట గూర్చి గ్రహించారా? వారుంటున్న ప్రపంచపు ప్రవర్తన విలువలను వారు సవాళు చేసేంత ధైర్యాన్ని, ప్రోత్సాహాన్ని పొందియున్నారా? మనము పొందామా? ప్రాశ్చాత్య సంగీతము మరియు దేశీయ సంగీతము వినుట అనేది లౌకిక జ్ఞానాభ్యాసము. తక్షణమే తృప్తిని కలిగియుండుట అనేది నేటి కాలపు పిలుపైయుంది. దేనికొరకు వేచియుండకు అని మనకు చెప్పబడింది. ప్రఖ్యాతమైన టి.వి. కార్యక్రమాలు మనలను త్వరగా తృప్తిపరచడానికి అనేక నూతన కార్యక్రమాలను చేయుట ద్వారా మనలను ఆకర్షిస్తాయి. వేవేల మంది వారికి నచ్చింది చేస్తూ, యిప్పుడే చేస్తూ ఎటువంటి ఉన్నతమైన పిలుపు లేకుండా జీవిస్తున్నారు.

పరిశుద్ధులుగా ఉండవలసిన క్రైస్తవులు ఇటువంటి లోకములో జీవిస్తున్నారు. పేతురు పత్రిక చదువువారికి, క్రైస్తవులుగా వారెరిగిన పరిశుద్ధ జీవితమునకును, మరియు వారి నీచమైన నమ్మకములేని పూర్వపు బ్రతుకులకు మధ్య కనిపించని హద్దులు ఏవీ లేవు. బహుశ మనం జీవిస్తున్న ప్రపంచం వ్యత్యాసమైనది. నేడు పరిశుద్ధులకు, మరియు అపరిశుద్ధులకు మధ్య ఉన్న హద్దు రేఖ తరచూ కనిపించనిదిగా మారింది. కొన్నిసార్లు క్రైస్తవులే ఈ అస్పష్టమైన హద్దులను పోషించుచున్నారు. ఎప్పుడైతే ప్రపంచము ఆకర్షిస్తుందో లేదా పిలుస్తుందో వారు, “పరిశుద్ధులుగా ఉండుటకు ప్రపంచము యొక్క అల్ప … ఆర్భాటమునుండి దూరంగావుండవలసిన అవసరం లేదంటారు. ఈ పరిశుద్ధతను గూర్చిన విషయమును చాలా దూరం తీసికొని వెళ్ళకుండునట్టు చూద్దాం అని అంటారు. లోకం తమ పై: “మత పిచ్చివారనే” భయంకరమైన ఆధునిక గుణవాచకమును తగిలించుదురని కొంతమంది క్రైస్తవులు ఆందోళన చెందుతున్నారు. వారు రాజుగారి పిల్లలుగా ఉండుటకు తీవ్ర ప్రయత్నాలలో ఉన్నట్టు కొందరు అనుకొనుచున్నారని భయపెడుతున్నారు.

నేడు వ్యాపిస్తున్న ఇంద్రియలోలుపతకు విజ్ఞప్తిచేయుట అనేక మంది క్రైస్తవులను నిరుత్సాహపరచి బాధపెడుతుంది. అందుకే యెహోషువా ఆనాటి ఇశ్రాయేలువారికి చెప్పిన మాటలు నేటి ఆధునిక సంఘానికి సరిపడతాయి: “యెహోవా పరిశుద్ధ దేవుడు, రోషముగల దేవుడు, … మీరాయనను సేవింపలేరు” (యెహోషువ 24:19). పరిశుద్ధతకు సంబంధించిన సవాళ్ళను ఎదుర్కొనుటకు మనము సిద్ధముగా ఉన్నామా? మనం ఎలా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలమో ఖచ్చితంగా చెప్పలేం. కానీ మోషే యిలా జవాబు యిచ్చాడు: “నేడు నేను నీకాజ్ఞాపించు ఈ ధర్మమును గ్రహించుటకు నీకు కఠినమైనది కాదు, దూరమైనది కాదు. నీవు దానిననుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగానున్నది; నీ హృదయమున నీ నోటనున్నది” (ద్వితీయోపదేశకాండము 30:11, 14).

అపవిత్రమైన ప్రపంచములో పరిశుద్ధులుగా ఉండుటకు వారు చేస్తున్న పోరాటాన్ని బట్టి పేతురు వారికి రెండు మూలాలను సూచించాడు. దానిలో మొదటిది, పరిశుద్ధ పట్టణానికి ప్రయాణం చేస్తున్న సహ ప్రయాణికులు అనగా క్రైస్తవులకు సహోదర ప్రేమను ఇచ్చి పుచ్చుకొనుట ద్వారా పరిశుద్ధతకు కావలసిన ఆధారం లభిస్తుంది. చదువరుల పరిశుద్ధత మరియు విధేయత రెండునూ వారి యొక్క నిష్కపటమైన ప్రేమయందు వ్యక్తపరచబడుతుందని, అందుకే వారిని “యొకనినొకడు హృదయ పూర్వకముగాను మిక్కటముగాను ప్రేమించుడి” (1:23) అని పేతురు హెచ్చరించాడు.

రెండవది, ప్రపంచము దాని ఆకలి దప్పులు, మహిమ అన్నియు తాత్కాలికమైనవి; కానీ పరిశుద్ధత నిత్యము నిలుచునది. "మీరు అక్షయ బీజమునుండి పుట్టినవారు," అని పేతురు చెప్పాడు (1:23). తరువాత యెషయా 40:6-8నుండి ఒక చక్కని వాక్య భాగమును ఎత్తి చూపారు, యిట్టిది కీర్తన 103:15, 16 యొక్క ప్రతిధ్వని అయి యున్నది, "సర్వ శరీరులు గడ్డినిపోలినవారు, వారి అందమంతయు గడ్డి పువ్వువలె ఉన్నది; గడ్డి ఎండును, దాని పువ్వును రాలును, అయితే **ప్రభువు** వాక్యము ఎల్లప్పుడును నిలుచును" (1:24, 25ఎ).

## ముగింపు

పేతురు 1:13-25లో తన పత్రిక చదువువారిని పరిశుద్ధులుగా ఉండుటకు ప్రేరేపించాడు, మరియు పరిశుద్ధతకై మూడు మార్గాలను సూచించాడు: విధేయత, విమోచన, మరియు తిరిగి జన్మించుట. పేతురు పత్రిక చదివిన మొట్టమొదటి క్రైస్తవుల ప్రపంచం నేటి ప్రపంచంతో కొన్ని విషయాలలో ఏకీభవించినప్పటికీ, రెండింటి మధ్య కొన్ని యితర విషయాలలో గమనించ దగ్గ వ్యత్యాసము ఉంది. మొదటి శతాబ్దపు చివరి కాలంలో చిన్న ఆసియాలోని క్రైస్తవులు, క్రైస్తవేతరుల మధ్య చాలా తీక్షణమైన సరిహద్దులు ఏర్పడ్డాయి. "క్రీస్తు ప్రభువని" చెప్పినందుకు క్రైస్తవులు అపహాస్యము చేయబడిరి, కొన్నిసార్లు భౌతికంగా దూషించబడిరి. పేతురు వారి మానసిక, భౌతిక దూషణలనుండి వారికి ఉపక్షమనం కల్పించుట లేదుగాని, దానికి బదులు ఆయన పరిస్థితి తీవ్ర రూపం దాల్చవచ్చునని చెప్పాడు. ఏది ఎదురైనప్పటికి వారు దేవుని ప్రజలని, దేవుని ప్రజలు పరిశుద్ధులని గమనించని వారిని హెచ్చరించాడు.

20వ శతాబ్దపు ప్రపంచములోని క్రైస్తవులు అనగా ప్రభువు నామాన్ని ధరించిన వారికి పరిశుద్ధులుగా ఉండుటకంటె మించిన అవసరం వేరొకటిలేదు. రాజీపడటానికి గాని, మన్నించడానికిగాని అవకాశం లేదు. కొంతమంది ఆధునిక క్రైస్తవులు కనీసం అమెరికాలోని వారు భౌతికమైన పగతీర్పుకు భయపడాలి. నేడు పాపము మనలను కౌగిలించుకొని మనము కేవలం మనుష్యులమని, అంతకంటె ఎక్కువగా మనలను గూర్చి మనం ఊహించుకోవలదని చెప్పుచున్నది.

క్రైస్తవులు ఒకరికొకరు అవసరం, మనము హృదయ పూర్వకముగా ఒకరినొకరు ప్రేమించాలి. క్రైస్తవులను ఒక పరిశుద్ధ ఆత్మీయ భవనముగా క్రీస్తును మలచాడు. ఈ భవనములో మనం ఒకరినుండి మరొకరు సహాయమును బలమును పొందవచ్చు. క్రీస్తు నిర్మించిన భవనము సహించునది. యిది గడ్డిని పోలిన మహిమవంటిది కాదు, వెంటనె వాడిపోదు. 2వ అధ్యాయములో సజీవమైన రాళ్ళచే నిర్మించిన భవనమును గూర్చి పేతురు వ్రాసాడు. యిట్టిది చేతులతో నిర్మించినది కాదు. యిది గొఱ్ఱెపిల్ల యొక్క రక్తముచే పాపమునుండి విమోచించబడి, అనగా పూర్వపు అజ్ఞాన స్థితినుండి విడిపింపబడిన స్త్రీ పురుషులచే నిర్మించబడినది. పరిశుద్ధ అలయం అని అర్థం చేసుకోవాలి.